క్లుప్తంగా

నరసాపురం పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు



నరసాపురం సొసైటీలో పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

నరసాపురం: సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పీఏసీఎస్‌లో కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు షేక్ బులి మస్తాన్ పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సహకారసంఘాల అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతుందన్నారు. రైతుల సంక్షేమ కోసం సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు. సహకార శాఖ డివిజన్ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌లో సహకారశాఖ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు, ఉద్యోగులు కె.జోసఫ్‌పాల్, పి.ఆనంద్‌రాజు, ఎం.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ సొలస రాంప్రసాద్ మృతి



సొలస రాంప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ప్రముఖ న్యాయవాది, మాజీ మునిసిపల్ కౌన్సిలర్ సొలస రాంప్రసాద్ (70) ఆదివారం మృతి చెందారు. రాంప్రసాద్ ఆదివారం అస్వస్థతకు గురి కాగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గం మధ్యలో విజయవాడ చేరుకునే సరికి మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై ప్రముఖులు సంతాపం తెలిపారు.

వైభవంగా పడిపూజ



పడి పూజలో పాల్గొన్న స్వాములు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి పడి పూజ చేశారు. రాఘవేంద్ర గురుస్వామి, బాబుల్ గురుస్వామి ఆధ్వర్యంలో 28వ వార్షికోత్సవ పడి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. బోళ్ల సత్యనారాయణ దంపతులు పడి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, నవగ్రహ మండపారాధన, గణపతి హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు చేశారు. మోహన్ నంబూద్రి గురుస్వామి పడిహారతి ఇచ్చారు. పడాల గురుస్వామి బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఓదూరి నరసింహాయి, మీసాల రాము స్వామి, ఓదూరి నాగసత్యనారాయణ, కూనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయానికి రూ.1.40 లక్షల ఆదాయం

భీమవరం ప్రకాశం చౌక్: భీమవరం గునుపూడిలో వేంచేసి యున్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామివార్ల దేవస్థానం నందు కార్తీక మాసోత్సవాల్లో భాగంగా 6 రోజులకు రూ.1.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో బి.రామకృష్ణరాజు తెలిపారు. భక్తులు దర్శన టికెట్ల ద్వారా రూ.1,21,550లు, పూజా రుసుముల ద్వారా రూ.800లు, లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,310లు, విరాళాల ద్వారా రూ.1,050లు మొత్తం రూ.1,40,995లు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

హామీలను నెరవేర్చాలంటూ దళితుల నిరసన

పాలకోడేరు: గరగపర్రులో సాంఘిక బహిష్కరణకు గురైన దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఐదు హామీలను అమలుచేయాలని కోరుతూ ఆదివారం నినాదాలు చేశారు. గరగపర్రులో గరగపర్రు బాధితుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డొల్ల పేతురు, కర్తాక యేసు, డొల్ల యోనాలు మాట్లాడుతూ 2017 తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గరగపర్రు దళితులు సాంఘిక బహిష్కరణకు గురైతే, అప్పుడు కేవలం 262 మందికి మాత్రమే కుటుంబానికి ఒక్కరికి రూ.లక్ష రూపాయలు చొప్పున నాటి రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు. దళిత నేత డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు కృషి మేరకు 500 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాధించడం జరిగిందన్నారు. డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర్ బాబు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సూచనల మేరకే ఐదు డిమాండ్లపై అప్పటి కలెక్టర్, ఎస్పీ, మంత్రి రంగనాథరాజు సంతకాలు చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు మాత్రమే పూర్తయిందని, దళితులకు ఇంకా పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, మూడెకరాల భూమి కేటాయింపు జరగలేదని వివరించారు. వెంటనే చట్ట ప్రకారం దళితులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరారు. గరగపర్రు ఉద్యమ నాయకులుగా చెప్పుకుంటున్నవారితో జాగ్రత్త వహించాలన్నారు. అద్దంకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనల సందడి



నరసాపురం: సాయినాథ్ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు



పాలకొల్లు అర్బన్: గౌడ, శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సంఘీయులు ఇతర కులస్తులతో ఐకమత్యంగా మెలిగి విద్య, రాజకీయ, సామాజికంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గౌడ, శెట్టిబలిజ, శ్రీశయన, యాత, ఈడిగ కార్తీక వనసమారాధన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని సంఘ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి - ఏడుకొండలు దంపతులు, అరట్లకట్ట ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, వాలమర్రు సొసైటీ అధ్యక్షుడు వేండ్ర సింహాచలం, కాగిత సూర్యనారాయణ దంపతులు ఉసిరి చెట్టుకి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ముఖ్య అతిథిగా పాల్గొని సంఘీయులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కొమ్ముచిక్కాలకు చెందిన చిన్నారులు కోలాట భజన చేశారు. ఆర్కెస్ట్రా కళాకారుల ఆట, పాటలతో అలరించారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, సంఘ గౌరవాధ్యక్షుడు మేకా కోటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, చిట్టూరి ఏడుకొండలు, మామిడిశెట్టి పెద్దిరాజు, చినిమిల్లి గణపతిరావు, కడలి గోపి, కట్టా గోపాలకృష్ణ, జోగి వెంకటేశ్వరరావు, బొక్కా గంగాధరరావు, పెచ్చెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘీయుల కార్తీక వనసమారాధన

పెదసాయిబాబా గుడి రోడ్డులోని శిడగం సత్యనారాయణ లే అవుట్‌లో పద్మశాలీ సంక్షేమ సంఘ కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ప్రభాకర గురూజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సంఘ నాయకులు జాగు సత్యనారాయణ, నూతి సత్యనారాయణ, వింజుమూరి గాంధీ తదితరులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. సంఘ అధ్యక్షుడు సూదా కాంతారావు, ఉయ్యూరి చిరంజీవి, వంగల శ్రీనివాసరావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. చిన్నారుల ఆటల పాటలతో సందడి నెలకొంది.

ఉత్సాహంగా కాపు వనసమారాధన

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ కాపు కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని కాపు కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో కాపులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలోని కాపు కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ 1.50 కోట్లు విరాళం అందించిన ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడును కాపు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగించారు. నాయుడు ఇంటి వద్ద నుంచి కల్యాణమండపం వరకూ ఊరేగింపుగా తీసుకొచ్చి అక్కడ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, కొత్తపల్లి సుబ్బారాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, కాపుసంఘం నేతలు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, చాగంటి సత్యనారాయణ, పప్పుల రామారావు, పోలిశెట్టి రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవంగ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన

పట్టణంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీకవన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆట, పాటలతో ఆహ్లాదంగా గడిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు మన సంస్కృతిలో భాగమన్నారు. దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. సంఘ పెద్ద సాయినాథ్ ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఉమారామలింగేశ్వర దేవాంగ సంక్షేమసంఘం పెద్దలు ద్వారా హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సిద్ధాంతంలో పిక్నిక్‌ల సందడి నెలకొంది. తణుకు, పెరవలి, పెనుగొండ, పెనుమంట్ర మండలాల నుంచి ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పాటు, పలు సంఘాల వారు సైతం కార్తీక వన భోజనాలు గోదావరి తీరంలో ఏర్పాటు చేసుకోవడంతో కేదారీఘాట్ పర్యాటకులతో సందడి చేసింది. మధ్యస్థలంకలోని పడవలపై వెళుతూ ఉత్సాహంగా గడిపారు.



నరసాపురం: పట్టణంలో ఊరేగింపులో కాపులు



పాలకొల్లు అర్బన్: గౌడ,శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో ఉసిరిచెట్టుకి పూజలు చేస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు దంపతులు



పెనుగొండ: సిద్ధాంతంలో వశిష్ఠ గోదావరిలో పడవలపై విహారయాత్ర

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మన జిల్లా నుంచే కాక, తూర్పు, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. ఈ ఆలయం ఉన్న ప్రాంతం మీదుగా పేరుపాలెం బీచ్‌కు వెళ్లే పర్యాటకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ప్రైవేటు వ్యక్తులు,దేవస్థానం వారు నిర్మించిన వంట షెడ్లు భక్తులతో నిండిపోయాయి. భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

ఘనంగా స్త్రీ శక్తి దివస్



ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పుట్టిన నేల కోసం కత్తిపట్టి పోరాటం చేసిన వీర నారి ఝాన్సీ లక్ష్మీబాయి అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. ఆదివారం జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీబాయి జయంతిని స్త్రీ శక్తి దివస్‌గా జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి. త్రిమూర్తులు, బొక్కా భవాని దుర్గ, శశికళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్



నరసాపురం: కాటన్‌పార్కులో మ్యాచ్ తిలకిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



పాలకొల్లు సెంట్రల్: ఎల్ఈడీ స్క్రీన్ వద్ద జాతీయ జెండాలతో సందడి చేస్తున్న అభిమానులు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డు కాటన్ పార్కులో ఆదివారం క్రికెట్ సందడి నెలకొంది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్‌డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో పార్కులో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అలాగే మ్యాచ్‌ను తిలకించడానికి కుర్చీలు వేసి ఏర్పాట్లు చేశారు. క్రికెట్ ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరై మ్యాచ్‌ను బిగ్ స్క్రీన్‌పై తిలకించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కూడా జనంతో కలిసి మ్యాచ్ తిలకించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: అహ్మదాబాద్‌లో నరేంద్రమోదీ స్టేడియంలో ఆదివారం భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించడానికి పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ ఏనుగుల మేడ వద్ద పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) యువత ఉత్సాహం చూసి ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయించారు. మ్యాచ్ మొదలైన సమయం నుంచి యువత, పెద్దలు పెద్ద ఎత్తున ఎల్ఈడీ స్క్రీన్ వద్ద మ్యాచ్‌ను తిలకించారు. జాతీయ జెండాలతో కేరింతలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. రోడ్డుపైనే కుర్చీలు కూడా ఏర్పాటు చేయడంతో మ్యాచ్ ముగిసే వరకూ జనం కిటకిటలాడుతూనే ఉన్నారు.



పెనుగొండ: వడలిలో యువకులు ఏర్పాటు చేసిన టీవీ స్క్రీన్

పెనుగొండలో..

పెనుగొండ: ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా-ఆస్ట్రేలియా జట్టులు పోటీ పడడంతో ఆదివారం గ్రామగ్రామాన సందడి నెలకొంది. గ్రామాల్లో బిగ్ టీవీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, దుకాణాల్లోనూ టీవీల ముందే అందరూ అతుక్కుపోయారు. యువత కేరింతలతో సందడి చేశారు.



మొగల్తూరు: ఉన్నత పాఠశాల ఆవరణలో బిగ్‌స్క్రీన్ క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తున్న క్రీడాభిమానులు

మొగల్తూరులో..

నరసాపురం రూరల్: ఇండియా-ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను తీర ప్రాంత గ్రామాల్లోని యువకులు టీవీలు, సెల్‌ఫోన్ లైవ్‌లలో వీక్షించారు. మండల కేంద్రమైన మొగల్తూరు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో క్రికెట్ ప్రియులు పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున యువకులు మ్యాచ్‌ను వీక్షించారు.

కేదారీఘాట్‌లో లింగ ప్రతిష్ఠ



సిద్ధాంతం కేదారీఘాట్‌లో శివలింగ ప్రతిష్ఠ మహోత్సవం

పెనుగొండ: దక్షిణ కాశీగా పేర్గాంచిన వశిష్ఠా గోదావరి తీరంలోని సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో శివ లింగ ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం తోలేటి దుర్గా వరప్రసాద్ బ్రహ్మత్వంలో దార్లంక మారుతి సూర్యఘన ప్రసాద్, గంగా దుర్గా ప్రసన్న దంపతులు విఘ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శివ లింగ ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజలు నిర్వహించి, అనంతరం పుంగనూరు జాతి గో మాతకు స్వామి వార్ల ప్రథమ దర్శనం కల్పించారు. అనంతరం శివ మాలధారులు పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకంలు నిర్వహించారు. సిద్ధాంతం హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు,పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మాలధారుల అభిషేకం మహోత్సవం

కార్తీక మాసం పురస్కరించుకుని సిద్ధాంతంలో శివ మాలధారులు, అయ్యప్ప మాలధారులు శివుడి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూలతో మండపాన్ని ఏర్పాటు చేసి బ్రహ్మశ్రీ వెలవలపల్లి వెంకట సాయి కృష్ణ బ్రహ్మత్వంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శివుడు, అయ్యప్పల భజనలు నిర్వహించారు.



సిద్ధాంతంలో శివ మాలదారులు, అయ్యప్పమాలధారుల అభిషేక మహోత్సవం

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పోడూరు: గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిన్నూరు లోని శ్రీ సీతారామరాజు విజ్ఞానప్రభా శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ దండు కృష్ణంరాజు పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలకు, బాలికలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. చైర్మన్ కృష్ణంరాజు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లోని విజేతలకు వారోత్సవాల ముగింపు సందర్భంగా 20వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు బత్తుల జోగారత్నం, అభివృద్ధి కమిటీ కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు, తాళాబత్తుల వీరభద్రకుమారి, సీఆర్‌పీ కాటం భారతి, ఉపాధ్యాయులు ప్రియాంక, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



జిన్నూరు శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న దండు కృష్ణంరాజు

మహిళల రక్షణ కోసమే దిశా యాప్



భీమవరంలో మహిళలను సత్కరించిన దృశ్యం

భీమవరం: మహిళల రక్షణ కోసం రూపొందించిన దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని దిశా మహిళా పోలీస్ షేహేనాధ్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు మహిళలను సత్కరించారు. షేహేనాధ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఫోన్‌లో దిశా యాప్ ఉండాలని, ఈ యాప్‌లపై అన్ని కళాశాలలు, పాఠశాలలలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం లైబ్రేరియన్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండోర్ యూనిట్ కాలి విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఆదివారం అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ శాఖ ఏఈ బాబ్జి మాట్లాడుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న సబ్ స్టేషన్‌లో ఇండోర్ సెక్షన్‌లో బ్యాటరీకి చెందిన రెక్టిఫైర్ కాలిపోయిందని అన్నారు. ఇది మరమ్మతు చేయడానికి కంపెనీ ఇంజినీర్లే రావాలని అవుట్‌డోర్ యూనిట్ అయితే తాము మరమ్మతులు చేసే వీలుంటుందని తెలిపారు. దీని వల్ల సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరుగుతుండడంతో యువత, మహిళ అందరూ టీవీలకు అతుక్కుపోయారు. కరెంటు లేకపోవడంతో జనం ఆగ్రహానికి గురయ్యారు. వేరే లైన్ ద్వారా రాత్రి 10 గంటలకు విద్యుత్ సరఫరా చేసినట్లు ఏఈ బాబ్జి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గోపాలరావు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు సచివాలయ సమీపంలో గ్రామ దేవత శ్రీ వనువులమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆదివారం శంకుస్థాపన చేశారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవింద రాజుల నాయుడు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పెదమామిడిపల్లి ఉప సర్పంచ్ యాండ్ర గోపి పాల్గొన్నారు.

అల్లంగుంటలో.

పోడూరు: పెనుమదం శివారు అల్లంగుంటలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయం మండపం నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.